# ఐదు గ్యారెంటీలు.. అట్టర్‌ఫ్లాప్

## కాంగ్రెస్‌కు ఓటేస్తే.. భస్మాసుర హస్తమే!

### కర్ణాటకలో గద్దెనెక్కేందుకు 5 హామీలతో కాంగ్రెస్ మాయ

- అధికారంలోకి వచ్చి 6 నెలలైనా అమలుకాని మ్యానిఫెస్టో గ్యారెంటీలు
- ఉచిత విద్యుత్తు పేరిట చార్జీలను పెంచేసి బాదుతున్న హస్తంపార్టీ
- రూ.2.14 కోట్ల కుటుంబాలకు స్కీమ్ అమలంటూ ప్రభుత్వం గప్పాలు
- సవాలక్ష కొర్రీలు పెట్టి 8 లక్షల ఇండ్లకే పథకం పరిమితం చేసిన వైనం
- 1.3 కోట్ల మహిళల్లో కేవలం వందల మందికే 'గృహలక్ష్మి' ఫలాలు
- ఉచిత బస్సులంటూ ఇతర సర్వీసులను రద్దు చేసిన కర్ణాటక సర్కారు
- అతీగతీ లేని 'అన్నభాగ్య'.. ఉత్తగా మారిన యువనిధి పథకాలు
- కర్ణాటకలో 5 గ్యారెంటీలనే అమలు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలంటూ తెలంగాణ ప్రజలను బురిడీ కొట్టించే యత్నం

ఐదు గ్యారెంటీల పేరుతో
అరచేతిలో స్వర్గం చూపించారు..
కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఉచిత కరెంటు
ఇస్తామని ఊదరగొట్టారు..
ఆర్థిక సాయమంటూ మహిళలకు
మాయమాటలు చెప్పారు..
ఆడబిడ్డలకు బస్సుల్లో ప్రయాణం
ఉచితమంటూ ఊరించారు..
భృతి ఇస్తామంటూ నిరుద్యోగులతో
నిబ్బ రంగా మాట్లాడారు..
ఉచిత బియ్యమంటూ పేదలకు
పెద్దపెద్ద మాటలే చెప్పారు..

భస్మాసుర 'హస్తం' పార్టీ జిత్తులు
తెలియని అమాయక కన్నడ ఓటర్లు
కాంగ్రెస్‌ను గెలిపించారు.

ఆరు నెలలు గడిచింది..
ఇచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్క
గ్యారెంటీని సంపూర్ణంగా అమలు చేసిన
పాపాన పోలేదు కాంగ్రెస్ ప్రభుత్వం..

ఉచిత కరెంటు అంటూ ఊదరగొట్టిన
'గృహజ్యోతి'కి గ్రహపాట్లు మొదలయ్యాయి
మహిళలకు ఆర్థికభరోసానిస్తామన్న
'గృహలక్ష్మి'కి పైసల కటకట షురూ అయ్యింది
ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ
ఊరించిన 'శక్తి' స్కీమ్ శక్తివిహీనమైంది.
నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువ
నిధి' ఉత్తనిధిగానే మారిపోయింది.
పేదలకు ఉచిత బియ్యమని ఊదరగొట్టిన
'అన్నభాగ్య' అతీగతిలేకుండా తయారైంది.
ఇచ్చినా హామీలన్నీ సంపూర్ణంగా చేయలేదు.

గద్దెనెక్కేవరకూ ఇదిచేస్తాం..
అది చేస్తామంటూ ఊదరగొడతారు.
గ్యారెంటీల పేరిట మభ్యపెడతారు.
ఆదమరిచి అధికారాన్ని అప్పగిం
చామా?? నట్టేట మునుగుడే.
ఇదీ కాంగ్రెస్ అసలు స్వరూపం.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): బీజేపీ 40 శాతం కమీషన్ రాజ్ సర్కారుతో విసిగిపోయిన కర్ణాటక ప్రజల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో పెనం నుంచి పొయ్యిలో పడ్డ చందంగా తయారైంది. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ '5 గ్యారెంటీ ప్రకటనలు' చూసి ఆశపడ్డ కన్నడిగులకు, మబ్బుల్లో నీళ్లుజూసి ముంత ఒలకబోసుకొన్న దుస్థితి దాపురించింది. ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తుందనుకొన్న కాంగ్రెస్.. ప్రజలకు రిక్తహస్తాన్ని చూపించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చట్లేదని ఏకంగా సీఎం సిద్ధరామయ్యనే పదుల సంఖ్యలో మహిళలు నిలదీశారంటే హామీల అమలులో కాంగ్రెస్ చిత్తశుద్ధి ఏమిటో అర్థంచేసుకోవచ్చు.



### స్కీమ్ పేరు: యువనిధి

ఏం చెప్పారు: డిగ్రీ పాసైన యువతకు నెలకు 3 వేలు, డిప్లొమా చేసినవారికి 1,500 భృతిగా ఇస్తామన్నారు.

**ఇదీ పరిస్థితి:** గ్రాడ్యుయేషన్ పూర్తయ్యి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నవారికి నెలకు రూ.3 వేలు, డిప్లొమా చేసినవారికి (18-25 ఏండ్లు) రూ.1,500 నిరుద్యోగ భృతిగా చెల్లిస్తామని కాంగ్రెస్ హామీనిచ్చింది. రెండేండ్లపాటు ఈ భృతి ఉంటుందని చెప్పింది. అధికారంలోకి వచ్చి 6 నెలలైనా ఈ స్కీమ్ ప్రారంభంకాలేదు. నిరుద్యోగుల లెక్కలు తెలియాల్సి ఉన్నదని, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నవారు ఇందులో లబ్ధి పొందే ప్రమాదమున్నదని, ఉద్యోగనోటిఫికేషన్లు ఇస్తామంటూ కాలయాపన చేసింది. రెండేండ్ల కాలపరిమితిలో ఇప్పటికే 6 నెలలు గడిచిపోవడం, ఉద్యోగ నోటిఫికేష న్లు జారీ చేయకపోవడం, భృతిని ఇవ్వకపోవడం వెరసి కాంగ్రెస్ సర్కారు మోసాన్ని గ్రహించిన నిరుద్యోగులు నిరసనలు ఉద్ధృతం చేస్తున్నారు. భృతి ఇస్తామంటూ కాంగ్రెస్ తమని మోసం చేసిందంటూ నిరుద్యోగులు మండిపడుతున్నారు.

### ఎగ్గొట్టాలన్న ఉద్దేశమే!

5 గ్యారెంటీల అమలులో కర్ణాటక కాంగ్రెస్ ఘోరంగా విఫలమైంది. ఈ స్కీమ్‌లను అమలు చేయాలంటే ఎన్ని నిధులు అవసరమైతాయి? ఏ విధంగా ముందుకు పోవాలన్న దానిపై ప్రభుత్వం పెద్దగా కసరత్తు చేయలేదని, ఎగ్గొట్టాలన్న ఉద్దేశం ఉండటంతోనే ఈ విధంగా ప్రభుత్వ వైఖరి ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 5 గ్యారెంటీలను సంపూర్ణంగా అమలు చేయాలంటే ఏటా ప్రభుత్వ ఖజానాపై రూ.62 వేల కోట్లకు పైగా భారం పడుతుంది. మొత్తం బడ్జెట్‌లో ఇది దాదాపు 20 శాతంతో సమానం. దీంతో కాంగ్రెస్ వెనుకడుగు వేసినట్టు మరికొందరు అభిప్రాయపడుతున్నారు. 5 గ్యారెంటీలతో అరచేతిలో వైకుంఠంచూపించి తమను కాంగ్రెస్ బురిడీ కొట్టించిందని అర్థమైపోవడంతో కన్నడ ప్రజలు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. కర్ణాటక తరహాలో తెలంగాణలో గెలిపిస్తే అదనంగా మరోటి కలిపి ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామంటున్న కాంగ్రెస్ మాటలు నమ్మితే గోస తప్పదని తెలంగాణ ప్రజానికాన్ని హెచ్చరిస్తున్నారు.



### స్కీమ్ పేరు: గృహజ్యోతి

ఏం చెప్పారు: పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా గృహ వినియోగదారులందరికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

**ఇదీ పరిస్థితి:** ప్రతీ ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామన్న కాంగ్రెస్.. సవాలక్ష కొర్రీలు పెడుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 2.14 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందనుకొన్న ఈ స్కీమ్, కొత్త ఆర్థిక కష్టాలను తీసుకొచ్చింది. గత ఆర్థిక సంవత్సరం 2022 నుంచి 2023 మార్చి వరకు గృహ విద్యుత్తు వినియోగం సగటున 200 యూనిట్లకు మించని కుటుంబాలు మాత్రమే ఈ స్కీమ్‌కు అర్హులంటూ సర్కారు తొలి షాక్ ఇచ్చింది. గృహ విద్యుత్తు వినియోగదారుడు గత సంవత్సరం సగటున 150 యూనిట్ల విద్యుత్తు వినియోగించినట్టయితే, దానికి అదనంగా 10 శాతం కలిపి (15 యూనిట్లు) మొత్తంగా 150+15=165 యూనిట్లుగా లెక్కిస్తారు. అంటే, 200 యూనిట్ల స్థానంలో 165 యూనిట్లను కటాఫ్‌గా మార్చేస్తారు. ఈ 165 యూనిట్లనే ప్రామాణికంగా తీసుకొని అంతవరకు మాత్రమే ఉచితంగా పరిగణించి 166వ యూనిట్ నుంచి ఎంత వినియోగిస్తే అంత మొత్తానికి బిల్లు (యూనిట్‌కు రూ. 7 చొప్పున) చెల్లించాల్సిందే. కొత్తగా కనెక్షన్ తీసుకొన్న వారికి 59 యూనిట్ల వరకు మాత్రమే మినహాయించి 60 యూనిట్ నుంచి 100 యూనిట్ల వరకు రూ.5.6 చొప్పున.. వంద దాటితే యూనిట్‌కు రూ.7 చొప్పున బిల్లు విధిస్తారు. ఉచిత విద్యుత్తు స్కీమ్‌లో మరో మాయాజాలం ఏమిటంటే, ప్రభుత్వం ఉచితంగా ప్రకటించిన 200 యూనిట్లకు ఒక్క యూనిట్ (201) అదనంగా కాల్చినా గృహజ్యోతి పథకం వర్తించదు. ప్రభుత్వం విధిస్తున్న కొత్త కొర్రీలతో గతంలో వచ్చే బిల్లు కంటే మూడింతలు ఎక్కువగా బిల్లు వస్తున్నదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. వినియోగదారుడికి పెండింగ్ బిల్స్ ఉంటే ఈ పథకానికి అర్హులు కారు అని ప్రభుత్వం మరో మెలిక పెట్టింది. ఇలా సవాలక్ష కొర్రీల అనంతరం.. ఉచిత విద్యుత్తు పథకానికి అక్టోబర్ నెలాఖరు నాటికి 8 లక్షలు మాత్రమే అర్హులుగా మిగిలారు. విద్యుత్తు కోతలతో ఈ లబ్ధిదారులకు కూడా ప్రభుత్వం చుక్కలు చూపిస్తున్నది.

### స్కీమ్ పేరు: అన్నభాగ్య

ఏం చెప్పారు: పేదింట ప్రతీ వ్యక్తికి నెలకు 10 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం సరఫరా చేస్తామన్నారు.

**ఇదీ పరిస్థితి:** అధికారంలోకి వచ్చీరాగానే స్కీమ్ ప్రారంభిస్తున్నామంటూ ప్రకటించిన సర్కారు.. ఉచిత బియ్యాన్ని సరఫరా చేయడంలో మాత్రం చేతులెత్తేసింది. బియ్యం దొరకటంలేదంటూ గగ్గోలు మొదలుపెట్టింది. 10 కిలోల బియ్యంలో కేంద్రం ఇచ్చే 5 కిలోల బియ్యం వాటాను అటుంచి.. మిగతా 5 కిలోల బియ్యానికి బదులు నగదును జమ చేస్తామని చెప్పుకొచ్చింది. అర్హులైన ఒక్కో వ్యక్తికి నెలకు రూ. 170 జమ చేస్తున్నట్టు వెల్లడించింది. అంటే కిలో బియ్యానికి రూ.34ను చెల్లిస్తున్నదన్న మాట. అయితే, బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ. 60పైనే ఉన్నదని, ప్రభుత్వం ఇచ్చే రూ. 170తో నెలంతా ఎలా బతుకగలమని పేద, మధ్యతరగతి ప్రజలు మండిపడుతున్నారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయిందని ధ్వజమెత్తుతున్నారు.



### కర్ణాటకలో కాంగ్రెస్ ఐదు పథకాలు- వాటి దుస్థితి

| పథకం | వివరణ | ప్రస్తుత పరిస్థితి |
|---|---|---|
| గృహలక్ష్మి | ఇంటి మహిళా పెద్దకు నెలకు రూ.2000 | మొదటి నెలకే చెల్లింపులు. అదీ కొందరికే |
| గృహజ్యోతి | 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు | చార్జీలు పెంచింది. విద్యుత్తు కోతలకు దిగింది. |
| యువనిధి | డిగ్రీ పాసైన యువతకు నెలకు రూ.3000 భృతి | ఉద్యోగనోటిఫికేషన్లు ఇస్తామంటూ కాలయాపన |
| అన్నభాగ్య | ప్రతి వ్యక్తికి నెలకు 10 కిలోల ఉచిత బియ్యం | బియ్యానికి బదులు నగదు రూ.170 చెల్లింపు |
| శక్తి | ఆర్టీసీ బస్సుల్లో మహిళకు ఉచిత ప్రయాణం | బస్సు సర్వీసులు ఎడాపెడా రద్దు. నిధుల కోత |



### స్కీమ్ పేరు: శక్తి

ఏం చెప్పారు: మహిళలకు ఆర్టీసీ బస్సులో పూర్తిగా ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు.

**ఇదీ పరిస్థితి:** 'శక్తి' స్కీమ్‌కు నిధుల కటకట మొదలైంది. పథకం అమలు కోసం సిద్ధరామయ్య సర్కారు బడ్జెట్‌లో రూ.2,800 కోట్లు కేటాయించింది. వచ్చే ఏడాది ఏప్రిల్ వరకూ ఈ నిధులను వినియోగించనున్నట్టు వెల్లడించింది. అయితే, గత అదివారం నాటికి 'శక్తి' స్కీమ్ కోసం ఉద్దేశించిన బడ్జెట్‌లో రూ.2,143 కోట్లు ఖర్చయినట్టు అధికారులు చెప్తున్నారు. మిగతా నిధులతో వచ్చే డిసెంబర్‌వరకు మాత్రమే బస్సులు నడిపించగలమని పేర్కొంటున్నారు. ప్రభుత్వం గనుక వెంటనే నిధులు విడుదల చేయకపోతే, బస్సులు నడుపడమే కష్టమని తేల్చిచెప్తున్నారు. 'శక్తి' స్కీమ్ తీసుకొచ్చిన తర్వాత బస్సుల్లో మహిళల ప్రయాణాలు తగ్గుతాయని కాంగ్రెస్ సర్కారు తప్పుగా అంచనా వేసింది. అయితే, అంచనాలకు మించి మహిళలు ఫ్రీ బస్సులను వినియోగిస్తుండటంతో డీజిల్ మోత మోగింది. దీంతో వ్యయ నియంత్రణ చర్యలకు దిగింది. అనేక మార్గాల్లో బస్సు సర్వీసులను నిలిపేసింది. గతంలో 5-10 నిమిషాలకు వచ్చే ఒక్కో బస్సు, ఇప్పుడు 40 నిమిషాలకు కూడా రావట్లేదని 'ది హిందూ' మీడియా సంస్థ ఇటీవల నిర్వహించిన సర్వేలో మహిళలు మండిపడ్డారు. ఇక, శక్తి స్కీమ్ కారణంగా తమ వాహనాల్లో ప్రయాణించే వారి సంఖ్య తక్కువైందని ఆటో రిక్షాలు, క్యాబ్ డ్రైవర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. తమ ఉపాధికి గండిపడేలా చేసిన సర్కారే నెలకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. దీంతో కాంగ్రెస్ సర్కారు తలపట్టుకొంటున్నది.



### స్కీమ్ పేరు: గృహలక్ష్మి

ఏం చెప్పారు: ప్రతీ ఇంట్లో మహిళా యజమానికి నెలకు రూ.2 వేలు.

**ఇదీ పరిస్థితి:** కాంగ్రెస్ సర్కారు ఇప్పటివరకూ ఈ స్కీమ్‌ను సంపూర్ణంగా అమలుచేసిన దాఖలా లేదు. స్కీమ్ ద్వారా రాష్ట్రంలోని మహిళలందరికీ ఆర్థిక భరోసా లభిస్తుందని ఊదరగొట్టిన హస్తం పార్టీ పెద్దలు, వందల సంఖ్యలోనే.. అదీ ఒక్క నెల మాత్రమే డబ్బులు జమచేశారు. పథకం లబ్ధిదారులు కావాలంటే, విధిగా తమ వివరాలు, డాక్యుమెంట్లతో సేవా సింధు, గ్రామ వన్, బెంగళూర్ వన్, కర్ణాటక వన్ వెబ్ పోర్టల్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకూ వివిధ పోర్టల్స్ ద్వారా 1.3 కోట్ల మంది మహిళలు పేర్లు నమోదు చేసుకున్నారు. వారికి రిజిస్ట్రేషన్ నంబర్లతో ఫోన్లకు మెసేజీలు కూడా వచ్చాయి. అయితే, డబ్బులు మాత్రం వందల మందికి మాత్రమే జమయ్యాయి. అదీ ఒక్క నెల మాత్రమే. స్కీమ్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలంటే ఏటా రూ.32 వేల కోట్ల నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇప్పటికే ఆరేడు నెలలు గడిచిపోయినందున ఇప్పటికిప్పుడు స్కీమ్‌ను కొనసాగించాలంటే కనీసం రూ.18 వేల కోట్లయినా అవసరమని అధికారులు చెప్తున్నారు. అయితే, ఆ స్థాయిలో నిధులు లేవని అర్థమవుతున్నది. ఈ పథకం కోసం మహిళలు సీఎం సిద్ధరామయ్యతోనే వాగ్వాదానికి దిగడం ఇటీవల సంచలనమైంది.

# కర్ణాటకలో 'ఎన్నికల' కరెంట్

## కన్నడ రైతులను బతికించిన తెలంగాణ

**బీఆర్ఎస్ విమర్శలతో కన్నడ కాంగ్రెస్ అప్రమత్తం**

- కర్ణాటకలో ఐదు గంటల కరెంట్‌పై తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాకరేపడంతో నష్టనివారణ చర్యలు
- ఎంత ఖర్చయినా పక్క రాష్ట్రాలనుంచి కొని వ్యవసాయానికి 7 గంటలు ఇస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటన
- పట్టణాలు.. నగరాలకు కోతలు తగ్గించి కాస్త ఉపశమనం
- తెలంగాణలో ఎన్నికల తర్వాత వస్తుందో? రాదో?
- ఇది ఎంతకాలం ఉంటుందో?: కన్నడ ప్రజల అనుమానం
- తెలంగాణ పుణ్యమాని కోతలు తగ్గాయని సంబురం

ప్రస్తుతం కొన్ని జిల్లాలకు వ్యవసాయానికి 5 గంటల కరెంటే ఇస్తున్నాం. చెరుకు, వరికోతకు వచ్చినందున ఎక్కువ సమయంపాటు విద్యుత్తు అవసరమని వ్యవసాయ శాఖ సూచించింది. రాబోయే రోజుల్లో 7 గంటల సరఫరా చేస్తాం. ఇతర రాష్ట్రాల నుంచి కొని రైతులకు ఇస్తాం.

-కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

### తెలంగాణలో ఎన్నికలు లేకుంటే వచ్చేదా?

తెలంగాణ ఎన్నికల పుణ్యమా అని ఇక్కడ సక్రమంగా విద్యుత్తు సరఫరా అవుతున్నది. ఇది ఎంత కాలం ఉంటుందో చెప్పలేం. అక్కడ ఎన్నికలు ముగిస్తే సమస్య మళ్లీ మొదటికి వస్తుందేమో అనే భయం కలుగుతున్నది. ఇది నా ఒక్కడిదే కాదు.. ఇక్కడ ప్రతి ఒక్కరిలోని అనుమానం.

- వినోద్, సూపర్‌వైజర్, కాటన్ జిన్నింగ్ మిల్లు, రాయచూర్

(బళ్లారి, రాయచూర్ నుంచి నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి వెల్జాల చంద్రశేఖర్)

'కరంట్ వస్తుందా?'. 'ఇప్పుడైతే వస్తుంది.. ఇది ఎంతకాలం ఉంటుందో తెల్వదు.. అక్కడ (తెలంగాణ) కాకరేగితే ఇక్కడ (కర్ణాటక) కరెంట్ ఇస్తున్నారు. తెలంగాణలో ఎన్నికలు అయిపోతే ఇస్తరో? లేదో? తెలియదు' అని రాయిచూర్ కాటన్ జన్నింగ్ మిల్లులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వినోద్ అనుమానం వ్యక్తంచేశాడు. ఇది ఒక్క వినోద్ అనుమానమే కాదు.. కర్ణాటక ప్రజలందరి మదిలోనూ మెదులుతున్న ప్రశ్న. కర్ణాటక తరహాలో తమను గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు తెలంగాణలో చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొడుతూ, 'మా దగ్గర 24 గంటలు ఇస్తుంటే.. 5 గంటలు ఇచ్చే కర్ణాటక పాలకపక్షం నేతలా మమ్మల్ని తప్పుపట్టేది' అని సీఎం కేసీఆర్ మొదలుకొని ఆ పార్టీ ముఖ్య నేతలు నిలదీస్తున్న నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం అప్రమత్తమైంది. వారం, పది రోజుల నుంచి తమ పట్టణాలు, నగరాల్లో కోతలు లేకుండా విద్యుత్తు సరఫరా చేసేందుకు నానా తంటాలు పడుతున్నది. అయినప్పటికీ రోజుకు నాలుగైదు గంటలపాటు విద్యుత్తు కోతలు విధిస్తూనే ఉన్నారు. తెలంగాణ ఎన్నికల పుణ్యమా అని ఈపాటి కరెంట్ అయినా వస్తున్నదని పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల యజమానులు, కార్మికులు చెప్తున్నారు.

### వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు తీవ్ర నష్టం



కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కోతలు, చార్జీల పెంపుతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన నెలకే 5వేల మందితో ధర్నా చేయక తప్పలేదు. పెంచిన చార్జీలతో ప్రొడక్షన్ తగ్గింది. ఇది ఉపాధి రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. ఒకవైపు పరిశ్రమలకు సరిపడా విద్యుత్తు సరఫరా చేయకుండా పవర్ హాలిడేస్ ప్రకటించి, మరోవైపు విద్యుత్తు చార్జీలు పెంచితే ఏ విధంగా అభివృద్ధి చెందుతాయి? రైతన్నలు పంటలను కాపాడుకొనేందుకు నిత్యం ఆందోళనలు చేయాల్సి వస్తున్నది. మైనింగ్, వ్యవసాయరంగం, పరిశ్రమలు సమస్యను ఎదుర్కోవాల్సి వస్తున్నది. వ్యవసాయ రంగాన్ని, రైతులను కాపాడుకోకపోతే మున్ముందు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. పది రోజుల నుంచి పరిశ్రమలకు విద్యుత్తు సరఫరా కాస్త మెరుగైంది.

- చిట్టూరి శ్రీనివాస్‌రావు, గౌరవాధ్యక్షుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, బళ్లారి

### కాంగ్రెస్ పాలన షురూ నుంచీ కటకటే

కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలు తీవ్ర విద్యుత్తు కోతలను ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర తాగు, సాగునీటి కోసం అల్లాడిపోతున్నా రు. చేతికొచ్చిన మెట్ట పంటలను కాపాడటం లో కర్ణాటక ప్రభుత్వం విఫలమైందని ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం తెలంగాణలో ఎన్నికలు ముగిసే వరకైనా కొంతలో కొంత మెరుగైన విద్యుత్తును సరఫరా చేసి ఈ గండం నుంచి బయటపడేందుకు కర్ణాటక ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. తాము అధికారంలోకి వస్తే 24 గంటల విద్యుత్తు, 5 గ్యారెంటీ పథకాలను అందిస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చాక ఆరు నెలలు తిరక్కుండానే రాష్ట్రం తీవ్ర విద్యుత్తు సంక్షోభంలో పడిపోయింది. ఇది తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల్లో కాకరేపడంతో మసకబారుతున్న తన ప్రతిష్ఠను కాపాడుకునేందుకు కర్ణాటక ప్రభుత్వ అధినేతలు, మంత్రులు నష్టనివారణ చర్యలు చేపట్టారు. అదృష్టవశాత్తు తెలంగాణలో ఎన్నికల కారణంగా అయినా ప్రభుత్వం తమను పట్టించుకుంటుందన్న అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరు నెలలుగా విద్యుత్తు కోతల ప్రభావం వల్ల దాదాపు అన్ని రంగాలు తీవ్రంగా నష్టపోయాయి. ఇందులో ప్రధానంగా వ్యవసాయరంగం కుదేలైంది. చేతికొచ్చిన పంటలు ఎండిపోయి రైతన్నలు విలవిల్లాడుతున్నారు. కొంతకాలంపాటు పరిశ్రమలు పవర్ హాలిడేను ఎదుర్కోవడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెంచిన విద్యుత్తు చార్జీలు పెనుభారంగా మరాయి. విద్యుత్తు కోతల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర మంచి నీటి ఎద్దడి తలెత్తింది.



### కరెంట్ లేక అష్టకష్టాలు

కర్ణాటకలో కరెంట్ సమస్యతో అష్టకష్టాలు పడుతున్నాం. ఊళ్లల్లో పంటలు ఎండిపోతే బతకడానికి పట్నం వస్తే ఇక్కడా అదే పరిస్థితి. కరెంట్ లేక మిల్లులు నడుస్తలేవు. రెండు, మూడు వందలు ఖర్చు చేసి పెట్రోల్ పోసుకొని రాయచూర్‌కు వస్తే కరెంట్ లేక.. మిల్లులు నడవక.. కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియక రాత్రింబవుళ్లు పడిగాపులు కాస్తున్నాం. ఈ పరిస్థితిలో పేదోడు బతికేది ఎట్ల? ఒకప్పుడు తెలంగాణలో కరెంట్ లేక పనుల కోసం కర్ణాటకకు వచ్చేది. ఇప్పుడేమో కర్ణాటకలో పనులు లేక తెలంగాణకు వెళ్లాల్సి వస్తుంది.

- మిరుదొడ్డి నాగరాజు, బాయిదొడ్డి బీమేశ్, హమాలీలు, రాయచూర్

### కరెంట్ లేక దసరా సీజన్‌లో తీవ్రంగా నష్టపోయాం



బళ్లారిలో జీన్స్ పరిశ్రమరంగంలో 1996 నుంచి ఉన్నా. నా వద్ద ప్రత్యక్షంగా వంద మంది, పరోక్షంగా వంద మందికి ఉపాధి పొందుతున్నారు. మా పరిశ్రమకు దసరా సీజన్ చాలా ముఖ్యం. తీవ్రమైన కరెంట్ సమస్య తలెత్తడంతో గార్మెంట్ రంగం తీవ్రంగా నష్టపోయింది. దీంతో కొనుగోలు చేసిన సరుకులు, వస్త్రాలను కనీసం దీపావళికైనా అమ్ముకోవడానికి తంటాలు పడుతున్నాం. కరెంట్ కష్టాలతో లక్ష మంది ఉపాధి కోల్పోయారు. ఆందోళన బాట పట్టడంతో ప్రభుత్వం స్పందించింది. ఉన్నతాధికారులు చర్చలు జరిపి, సమస్య రాకుండా చూస్తాం.. కానీ సమస్యపై మీడియాకు ఎక్కవద్దని మాట తీసుకున్నారు. ప్రస్తుతం కూడా నాలుగు, ఐదు గంటలపాటు విద్యుత్తు కోతలు ఉన్నప్పటికీ కొంతలో కొంత సమస్య మెరుగుపడింది. జరిగిన నష్టం నుంచి గట్టెక్కడానికి ప్రయత్నం చేస్తున్నాం.

-మల్లికార్జున, పోలెక్స్ జీన్స్ యజమాని, బళ్లారి

### కరెంట్ సమస్య తీరలేదు..



రాష్ట్రంలో విద్యుత్తు సమస్య తొలిగిపోలేదు. ఉదయం కరెంట్ తీస్తే సాయంత్రానికి కాని రాదు. దీనివల్ల నా లాంటి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి చాలా ఇబ్బందిగా మారింది. ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని కరెంట్‌తో మా బతుకులు ఆగమైపోతున్నయ్. తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నం.

- మల్లికార్జునప్ప, పాన్ అండ్ జనరల్ స్టోర్ యజమాని, రాయచూర్

### విద్యుత్తు చార్జీల పెంపుతో అపార నష్టం



విద్యుత్తు చార్జీలు పెంచడం వల్ల కర్ణాటకలో కాటన్ అండ్ జిన్నింగ్ పరిశ్రమ తీవ్రంగా నష్టపోయింది. మొదటి నుంచి హైదరాబాద్ కర్ణాటకపై వివక్ష కొనసాగిస్తున్నాయి. దీనిపై న్యాయపోరాటం చేస్తు న్నాం. కమర్షియల్ విద్యుత్తుకు గతంలో యూనిట్‌కు రూ.7.10 వసూలు చేయ గా, ప్రస్తుతం సర్‌చార్జీలతో రూ.9.10 పడుతున్నది. కమర్షియల్ విద్యుత్తు చార్జీలు పెంచడం వల్ల రాయచూర్‌లోని 65 జిన్నింగ్ మిల్లులు, 90 రైస్ మిల్లులు, 110 బ్రిక్స్ అండ్ ఫ్లై యాష్ పరిశ్రమలు, 10 దాల్‌మిల్లులు, 5 పుట్నాల మిల్లులు నెలకు 78 కోట్ల మేరకు నష్టపోతున్నాయి.

-కే లక్ష్మీరెడ్డి, వైస్ ప్రెసిడెంట్, కర్ణాటక కాటన్ మిల్స్ అసోసియేషన్